క్లుప్తంగా

ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

నేరడిగొండ: మండలంలోని వడూర్‌లో శ్రీసీతారామచంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన గురువారం చేపట్టనుండడంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. బుధవారం విగ్రహాలకు పూజ కార్యక్రమాలు నిర్వహించారు. పురోహితులు ఎల్కూచి శ్రావణ్‌కుమార్ జోషి ఆధ్వర్యంలో అన్ని వసతులు ఏర్పాటు చేశారు. ప్రతిష్ఠాపన అనంతరం అన్నదాన ఉంటుందని, భక్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మానసిక ప్రశాంతతకు శిక్షణ అవసరం

ఆదిలాబాద్‌అర్బన్: వయోవృద్ధులు ఆరోగ్యంగా, మానసిక ప్రశాంతత కోసం ఆర్ట్ ఆఫ్ లివింగ్ శిక్షణ చాలా అవసరమని జిల్లా వయోవృద్ధుల సమాఖ్య అధ్యక్షుడు దేవిదాస్ దేశ్‌పాండే అన్నారు. బుధవారం పట్టణంలోని వయోవృద్ధుల జిల్లా సమైఖ్య కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. 65 ఏళ్లు దాటితే షుగర్, బీపీ, గుండె జబ్బులకు గురవుతున్నారని, ప్రతిఒక్కరూ రోజు చిన్న చిన్న చిట్కాలతో వ్యాయమం చేస్తూ ఆరోగ్యం కాపాడుకోవచ్చన్నారు. శిక్షణ ఏర్పాటు చేసిన ఓం ప్రకాష్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రామారావు, భాస్కర్, కిషన్, సత్యనారాయణ, వామన్, రాంకులకర్ణి, శివ్వన్న పాల్గొన్నారు.

తాగునీటి వసతి ఏర్పాటు

బోథ్: బోథ్ బస్టాండ్‌లో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు మండల కేంద్రానికి చెందిన మినరల్ వాటర్ సప్లయ్ సంఘం సభ్యులు తాగునీటి వసతి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంవత్సరం పొడవున నీటి వసతిని ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ కంట్రోలర్ సాయన్న, వాటర్ సప్లయర్స్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి



కాలిపోయిన శనగ కుప్పను పరిశీలిస్తున్న బొర్రన్న

బజార్‌హత్నూర్: మండలంలోని పిప్రి గ్రామంలో శనగపంట కుప్ప కాలిపోయి ఆర్థికంగా నష్టపోయిన బాధిత రైతు యాల్ల గంగారెడ్డిని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న కోరారు. బుధవారం పిప్రి గ్రామానికి చేరుకుని యాల్ల గంగారెడ్డి చేనులో కాలిపోయిన శనగ కుప్పను పరిశీలించారు. శనగ కుప్పకు నిప్పు పెట్టిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు జక్క మల్కన్న, రాజారెడ్డి, రాజు, గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

బేల తహసీల్దార్‌గా సర్ఫరాజ్ నవాజ్



సర్ఫరాజ్ నవాజ్

బేల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సర్ఫరాజ్ నవాజ్ తహసీల్దార్‌గా బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ బడాల రాంరెడ్డి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సూపరింటెండెంట్‌గా, సిరికొండ మండలంలో పని చేసిన సర్ఫరాజ్ నవాజ్ ఇక్కడికి బదిలీ అయ్యారు. ఇరువురిని డిప్యూటీ తహసీల్దార్ సిడాం వామన్, సర్వేయర్ గోవింద్‌లు సన్మానించారు. కార్యక్రమంలో ఆర్ఐ నారాయణ, కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాస్, వీఆర్ఏలు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నార్నూర్: అన్నాభావుసాఠె విగ్రహ ఆవిష్కరణను విజయవంతం చేయాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్ అన్నారు. బుధవారం అన్నాభావు సాఠె జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. విగ్రహ ఆవిష్కరణ, బహిరంగ సభల నిర్వహణపై చర్చించారు. ఈనెల 12న మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అన్నాభావుసాఠె విగ్రహావిష్కరణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు యునుస్ అక్బానీ, ఆడే సురేశ్, కాంతరావు దుర్గే, కాంబ్లే ఉదయ్, కొర్రెళ్ల మహేందర్, రాజ్‌సంగే రాజు, నర్సింగ్ మోరే పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



ఉట్నూర్‌రూరల్: మహిళలను సన్మానిస్తున్న ఎంపీపీ



ఆదిలాబాద్‌రూరల్: మాట్లాడుతున్న రిటైర్డ్ ఎంఈవో కౌసల్యా



బేల: కేక్‌కట్ చేస్తున్న ఎంపీపీ వనిత, జెడ్పీటీసీ అక్షిత పవార్



ఆదిలాబాద్‌టౌన్: సన్మానిస్తున్న రిమ్స్ డైరెక్టర్



ఇచ్చోడ: కార్మికులను సన్మానిస్తున్న నాయకులు



నార్నూర్: ఖంపూర్‌లో..



ఆదిలాబాద్: గోపాలకృష్ణ మఠంలో..



బోథ్: సొనాలలో ఆటల పోటీల్లో పాల్గొన్న మహిళలు

జిల్లా వ్యాప్తంగా మహిళా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించి, మరింత అభివృద్ధి చెందాలని అధికారులు, ప్రజాప్రతినిధులు సూచించారు. మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. పలు గ్రామాల్లో కేక్‌కట్ చేశారు. ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ సైన్స్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ కెప్టెన్ జగ్రామ్ అంతర్ బేడి విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. తెలంగాణ వైద్య ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. బజార్‌హత్నూర్‌లో సీఐటీయూసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి నలినిరెడ్డి, జిల్లా మాల సంక్షేమ సంఘం జిల్లా భవనంలో రిటైర్డ్ ఎంఈవో కౌసల్యా, మావల జెడ్పీటీసీ నల్ల వనితలు హాజరై మాట్లాడారు. - సాక్షి, నెట్‌వర్క్

అవార్డులు, సన్మానాలు

ఆదిలాబాద్‌టౌన్/ఇచ్చోడ/గుడిహత్నూర్/బోథ్: రిమ్స్ ఆస్పత్రిలో మహిళ ఉద్యోగులు, సిబ్బందిని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ బుధవారం సన్మానించారు. పట్టణ ఆర్కిటెక్ట్స్, ఇంజనీర్స్ అండ్ ఎల్టీపీఎస్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ శైలజను సన్మానించారు. ఇచ్చోడ గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికురాలు జల్లి ఎల్లమ్మ కలెక్టర్ రాహుల్ రాజ్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. గుడిహత్నూర్ మండలానికి చెందిన తహసీల్దార్ సంధ్యారాణి, ఐకేపీ సీసీ నాగమణి ఉత్తమ మహిళా అధికారులుగా అవార్డు అందుకున్నారు. బోథ్ మండలంలోని బాబెర గ్రామంలో స్వచ్ఛగ్రహి అవార్డు గ్రహీత ఆత్రం సుశీలను, ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వర్తిస్తున్న శారదను తెలంగాణ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ సన్మానించారు.



ఇచ్చోడ: అవార్డు అందుకుంటున్న ఎల్లమ్మ



ఆదిలాబాద్‌అర్బన్: బహుమతి అందజేస్తున్న అధ్యాపకులు



గుడిహత్నూర్: అవార్డు అందుకుంటున్న తహసీల్దార్



ఎదులాపురం: సన్మానిస్తున్న డీఎంహెచ్‌వో నరేందర్



బజార్‌హత్నూర్: మాట్లాడుతున్న నలిని రెడ్డి

నేడు గౌడ సంఘం సమావేశం

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం అత్యవసర సమావేశాన్ని గురువారం సాయంత్రం 5 గంటలకు పట్టణంలోని పిట్టలవాడలో గల ఆదివాసీ భవన్‌లో నిర్వహించడం జరుగుతుందని నాయకులు రంగు రమేష్‌చందర్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. సంఘ సభ్యత్వం, తదితర అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. సమావేశానికి గౌడ కులస్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

సరుకులు అందజేత

బోథ్: మండల కేంద్రానికి చెందిన రాథోడ్ సూర్యకళకు చెందిన ఇల్లు ఇటీవల అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. కాగా తెలంగాణ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ బుధవారం బాధితురాలిని పరామర్శించి, నిత్యావసర సరుకులు అందజేశారు. ఆయన వెంట సోలంకి సాయికుమార్, శ్రీకాంత్, పూండ్రు రాకేశ్‌రెడ్డి ఉన్నారు.

రక్తదానం

బోథ్: నిర్మల్ జిల్లాలో 14 నెలల బాబుకి ప్లేట్‌లెట్స్ తక్కువగా ఉండడంతో బోథ్‌కు చెందిన అనిల్ మాసం మంగళవారం అర్ధరాత్రి నిర్మల్‌కు వెళ్లి రక్తదానం చేశారు. అనిల్‌కు బాధిత కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట శ్రీనివాస్, జటాల శివ, రాహుల్ ఉన్నారు.

వర్ధంతి సభను జయప్రదం చేయండి

ఆదిలాబాద్‌టౌన్: సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శిగా సుదీర్ఘకాలం పని చేసి అమరుడైన కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ వర్ధంతి సభను జయప్రదం చేయాలని సంఘం నాయకులు కోరారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలో 'ఫాసిజం.. ప్రమాదంలో భారతదేశం' సదస్సు వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 10న సుభాష్ చంద్రబోస్ 7వ వర్ధంతి సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జగన్, ఆత్రం వినోద్, ఎర్రాజీ, హరీష్, శంకర్, కూరెల్లి వినోద్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

నార్నూర్: మండలంలోని బలాన్‌పూర్‌లో కోవ వంశానికి చెందిన పెర్సాపెన్ ఆలయ నిర్మాణానికి బుధవారం కుమురం భీం (ఆసిఫాబాద్) జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తరతరాల నుంచి వస్తున్న సంస్కృతి, సాంప్రదాయాలను గౌరవించాలన్నారు. కోవ వంశానికి చెందిన పెర్సాపెన్ (పెద్దదేవుడు) బలాన్‌పూర్‌లో ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

తలమడుగు: సైబర్ నేరాలపై అప్రమత్తగా ఉండాలని ఏఎస్సై సురేందర్ అన్నారు. బుధవారం మండలంలోని సకినపూర్‌లో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆన్‌లైన్‌లో లావాదేవీలు నడిపేవారు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. స్మార్ట్‌ఫోన్‌కువచ్చే లింకులను ఓపెన్ చేయవద్దన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మారుతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

తాంసి: మహిళ చట్టాలపై అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమా దేశ్‌పాండే అన్నారు. బుధవారం భీంపూర్‌లో మహిళల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. చదువుకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో భీంపూర్ సర్పంచ్ లింబాజీ, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ అరుగుల అశోక్, ఉమేష్ రావు, మండల వైద్యాధికారి విజయ సారథి, ఏపీఎం ప్రసాద్‌రాజ్ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఉట్నూర్ జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. మండల నాయ్య సేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి దుర్గారాణి పలు చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయవాదులు జమీర్ ఖాన్, దీరజ్‌గుప్త, జైవంత్‌రావు, వసంత్ రావు, అశోక్, సంగీత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమా దేశ్‌పాండే

ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి

- బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు

తాంసి: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. బుధవారం మండలంలోని పొన్నారిలో నూతనంగా నిర్మించిన అభయ అంజనేయ స్వామి విగ్రహ ఆవిష్కరణలో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహం ఊరేగింపులో పాల్గొన్నారు. గ్రామస్తులు ఐక్యంగా ఉంటూ అంజనేయ స్వామి విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సంజీవ్ రెడ్డి, ఉప సర్పంచ్ అశోక్, వైస్ ఎంపీపీ రఘు, సంజీవ్, గంగారెడ్డి, రమణ, దేవేందర్ పాల్గొన్నారు.

గుడిహత్నూర్: మండలంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనను దేశ ప్రజలు స్వాగతిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం 45 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జాదవ్ సునీత, సర్పంచులు తిరుమల్‌గౌడ్, దన్రు, డిప్యూటీ తహసీల్దార్ భాగ్యలక్ష్మీ, కేంద్రే జ్ఞానేశ్వర్, షగీర్‌ఖాన్ పాల్గొన్నారు.



ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే బాపురావు

ఓటమి గెలుపునకు నాంది

నేరడిగొండ: క్రీడల్లో గెలుపోటములు సహజమేనని, ఓటమికి గురైన యువత గెలుపునకు నాంది అనే విషయాన్ని గుర్తుంచుకోవాలని ఎంపీపీ రాథోడ్ సజన్ అన్నారు. మండలంలోని బొండిడి గ్రామంలో బుధవారం జరిగిన క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఫైనల్ మ్యాచ్‌లో బుగ్గారం జట్టు విజేతగా నిలవగా, బొండిడి జట్టు రన్నరప్‌గా నిలిచింది. విజేత జట్లకు ఎంపీపీ రాథోడ్ సజన్ బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తూ క్రీడాకారులను ప్రోత్సహించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆడే అనిత, గ్రామస్తులు జనార్దన్, సుభాష్, రమేశ్, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో శనగ పంట తీసుకురావాలి

బేల: మండల కేంద్రంలోని సబ్ మార్కెట్‌యార్డులో గురువారం నుంచి శనగ కొనుగోళ్లకు ప్రారంభం అవుతాయని, రైతులు సకాలంలో మార్కెట్‌కు తీసుకురావాలని బేల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో తిరుపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ రోజు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు తీసుకువచ్చిన శనగ వాహనాలను ఆరోజు కొనుగోళ్లకు అనుమతించడం జరుగుతుందన్నారు. ఒకవేళ మధ్యాహ్నం రెండు గంటల తర్వాత ఆలస్యంగా వాహనాలు వస్తే మరుసటి రోజు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రైతులు సహకరించాలని ఆయన కోరారు.

నేటి నుంచి కొనుగోళ్లు

నేరడిగొండ: శనగ కొనుగోళ్ల గురువారం నుంచి బోథ్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రారంభించడం జరుగుతుందని నేరడిగొండ పీఏసీఎస్ చైర్మన్ సాబ్లే కిషోర్‌సింగ్, సీఈవో బారె నాగభూషన్ ఒక ప్రకటనలో తెలిపారు. తేదీల వారీగా శనగ కొనుగోళ్ల చేయడం జరుగుతున్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించి శనగ పంట తీసుకెళ్లాలని సూచించారు. ఏమైనా సందేహాలు ఉంటే ఆయా క్లస్టర్ పరిధిలోని ఏఈవోలను సంప్రదించాలని కోరారు.

ఆర్థిక సాయం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని యాపల్‌గూడ గ్రామానికి చెందిన ఎస్‌కే మహముద్ అనే యువకుడు గత కొన్ని రోజులుగా అనార్యోగంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ వైద్య చికిత్స కోసం తన వంతుగా రూ. 5 వేలు ఆర్థిక సాయం చేశారు.

ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి



మహిళలను సన్మానిస్తున్న సభ్యులు

తలమడుగు: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికత అలవర్చుకోవాలని పూలజీ బాబా ధ్యాన మందిర ఆధ్యాత్మిక గురువు సునీత వెంకట్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో రైతువేదికలో ఆధ్యాత్మిక సత్సంగము నిర్వహించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలను సన్మానించారు. ధ్యాన గురువు పూలాజీ బాబా సూచించిన సన్మార్గంలో నడుచుకోవాలన్నారు. ఎంపీడీవో రమాకాంత్ దంపతులను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ధ్యాన మందిర కమిటీ ఉపాధ్యక్షుడు సురేష్‌రెడ్డి అశోక్, రాధమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

నియోజకవర్గంపై చిన్నచూపు!

- శిథిలావస్థలో తహసీల్ కార్యాలయం
- అద్దె భవనంలో కోర్టు
- మార్కెట్ కార్యాలయంలోనే కొనసాగుతున్న సబ్ ట్రెజరీ ఆఫీసు

బోథ్: ఎస్టీ నియోజకవర్గ కేంద్రమైన బోథ్ అభివృద్ధి ఆమడ దూరంలో ఉంది. మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల పరిస్థితి ఎక్కడవేసిన గొంగళి అక్కడే ఉన్న చందనంగా మారింది. తహసీల్ కార్యాలయం శిథిలావస్థకు చేరగా.. సబ్ ట్రెజరీ కార్యాలయం మార్కెట్ కమిటీ కార్యాలయంలో కొనసాగుతోంది. అగ్నికి ఇళ్లు, ఆస్తులు కాలిబూడిద అవుతున్న ఫైర్‌స్టేషన్ ఏర్పాటు అందని ద్రాక్షలాగే మిగిలింది. బోథ్ జూనియర్ సివిల్ కోర్టుకు శాశ్వత భవనం లేకపోవడంతో అద్దె భవనంలోనే కొనసాగుతోంది. రిజిస్ట్రేషన్ కార్యాలయం సైతం అద్దె భవనంలోనే కొనసాగుతోంది. నియోజకవర్గ కేంద్రమైనా ప్రభుత్వం తమ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంలో, నిధులు కేటాయింపులో చిన్నచూపు చూస్తోందని ఇక్కడి ప్రజలు భావిస్తున్నారు.

అద్దె భవనంలో కోర్టు..

బోథ్ జూనియర్ సివిల్ కోర్టు అద్దె భవనంలో కొనసాగుతోంది. గతంలో ఇతర ప్రాంతానికి తరలించే ఏర్పాట్లు జరగా.. బోథ్ ప్రజలు అడ్డుకున్నారు. భవన నిర్మాణానికి 1 ఎకరం 40 గుంటల భూమి ఉంది. ఈ స్థలంలో భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినా.. నిధులు మంజూరు కాలేదు. పలుమార్లు బార్ అసోసియేషన్ సభ్యులు ఉన్నతాధికారులను కలిసినా.. భవన నిర్మాణానికి అడుగులు పడటం లేదు. తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. అధికారులు స్పందించి నూతన భవనాలు నిర్మించాలని కోరుతున్నారు.



శిథిలావస్థలో తహసీల్ కార్యాలయం

భయం భయంగా విధులు

తహసీల్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఎక్కడ పెచ్చులూడి పడతాయోనని భయం భయంగా విధులు నిర్వర్తిస్తున్నాం. వర్షాకాలంలో వర్షపు నీరు పైకప్పు నుంచి పడుతుంది. దీంతో విధులు నిర్వహించడానికి ఆటంకం కలుగుతోంది.

– రమేశ్, తహసీల్ కార్యాలయ సిబ్బంది

భవన నిర్మాణం చేపట్టాలి

బోథ్ జూనియర్ సివిల్ కోర్టు భవన నిర్మాణాన్ని చేపట్టాలి. హైకోర్టులో భవన నిర్మాణానికి సంబంధించి ఫైల్ ప్రస్తుతం పెండింగ్‌లో ఉంది. ప్రజా ప్రతినిధులు కోర్టు భవన నిర్మాణానికి చొరవ చూపాలి.

– హరీష్, న్యాయవాది